క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ప్రభురెడ్డి

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌పీవో ప్రభురెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సర్పంచ్ మోహనప్రియతోపాటు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సరఫరా నిర్వహణను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వాణిజ్యపరంగా వినియోగించుకునేందుకు అనుమతి ఇప్పించాలని సర్పంచ్ విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు
- భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూలోని ప్రభుత్వ భూమి పశువుల మేత పోరంబోకు భూమి ఆక్రమణలను అడ్డుకోవాలని శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ మహ్మద్ పటాన్ ఆలీఖాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, పశువుల మేత పోరంబోకు ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 204, 207లలో 15.74 ఎకరాల భూమి ఉందని, దీనిని కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, దీనిని స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధీర్‌కుమార్, గోవిందయ్య, జయరామయ్య, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి తరఫున భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో శాంతిదుర్గ, తొట్టంబేడు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఈవోపీఆర్డీ కరుణాకరరెడ్డి.. భారతీయ న్యాయ సంహిత 2023, మహిళలపై, బాలల సంరక్షణకు తీసుకువచ్చిన నూతన చట్టాలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మహిళలతో మాట్లాడుతున్న వైద్యాధికారి

నారాయణవనం: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్ రాజు కోరారు. మండలంలోని వెంకటకృష్ణాపాళ్యం గ్రామాన్ని శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. వీధులను, మురుగు కాలువలను ఆయన పరిశీలించిచారు. ఆయన మాట్లాడుతూ, మురుగు, వర్షపు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, శుక్రవారం విధిగా డ్రై డే పాటించాలని అన్నారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర జ్వరాలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాల బారిన పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికైన పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి, ఎంఈవో భువనేశ్వరి అభినందించారు. అనంతరం వారితో కలిసి టేబుల్ టెన్నిస్ ఆడారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి అవకాశాలు అందుకోగలరన్నారు. కొందరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా ఆర్థిక స్తోమత లేక ఆగిపోతున్నారని, అలాంటి వారిని దాతలు ఆదుకోవాలని కోరారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు తమ వంతు సహాయం అందిస్తామన్నారు. ఉపాధ్యాయులు మహిత, గుణశేఖర్, చారు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గురుకులం.. సమస్యలతో సతమతం



దెబ్బతిన్న అరటిపండ్లను పరిశీలిస్తున్న అధికారులు



ప్రిన్సిపాల్ గది ముందు చెత్తాచెదారం

మండలంలో కనమనంబేడులోని ఏకలవ్య మోడ్రన్ గురుకులం సమస్యలతో కునారిల్లుతోంది. అరకొర వసతులు, పారిశుధ్యం సమస్యలు, నాణ్యత లోపించిన ఆహారం, సరిగాలేని మరుగుదొడ్లు, తాగునీరు..ఇత్యాది వాటితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎస్టీ విద్యార్థుల సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోకపోవడం, తిష్ట వేసిన సమస్యల మూలాన ఇప్పటికే 40మంది విద్యార్థులు గురుకులానికి గుడ్‌బై చెప్పి వేరే స్కూళ్లలో చేరిపోయారు.

- మెరుగైన వసతులు పూజ్యం
- భోజనం నాణ్యత అంతంత మాత్రమే
- పట్టించుకోని అధికారులు
- సౌకర్యాల లేమితో 40 మంది విద్యార్థులు గుడ్‌బై
- అధికారులకు సమస్యలు ఏకరువు పెట్టిన విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఏకలవ్య మోడ్రన్ ఎస్టీ గురుకుల పాఠశాలలో రాయలసీమ జిల్లాల నుంచి 387 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌ను బోధిస్తున్నారు. గురుకులంలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, 11 మంది ఉపాధ్యాయులు ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందినవారు కావడంతో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాట్లాడుతున్నారు. వారికి తెలుగు భాష రాకపోవడం విద్యార్థులకు శాపమైంది. పాఠ్యాంశాల పరంగా సందేహాలను మాతృభాషలో నివృత్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

మెనూ ప్రకారం అందని భోజనం

హాస్టల్‌లో విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. కుళ్లిన కూరగాయలలో నాసిరకమైన భోజనం పెడుతున్నారు. చిక్కీలు, స్నాక్స్‌ను సక్రమంగా ఇవ్వడం లేదు.

దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు

గురుకులంలోని మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. వీటితో పాటు స్నానపు గదులను శుభ్రం చేయకపోవడం లేదు. దుర్గంధమ నడుమ ముక్కులు మూసుకుని విద్యార్థులు ప్రకృతి పనులు కానిచ్చేస్తున్నారు. మరుగుదొడ్లలోని ఫ్లషర్లు పనిచేయడం లేదు.

దోమలతో సహవాసం

హాస్టల్ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండటంతో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. దోమలు విపరీతంగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. వేడినీరు లేకపోవడంతో విద్యార్థులందరూ చన్నీటి స్నానం చేస్తున్నారు.

గదులున్నా..ఒక్కో గదిలో 8 మంది విద్యార్థులు

హాస్టల్‌లో గదులున్నప్పటికీ ఒక్కో గదిలో 8 మంది విద్యార్థులను ఉంచుతున్నారు. వీరికి బాత్‌రూమ్‌లు చాలక స్నానాలకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నీళ్లు ఉన్నప్పటికీ హాస్టల్ గదులకు సక్రమంగా ఇవ్వకపోవడంతో మూడు రోజులకోసారి స్నానాలు చేస్తున్నామని విద్యార్థులు వాపోయారు. బట్టలు ఉతుక్కోలేక మాసిన వాటినే వేసుకుంటున్నారు.

రక్షణ కరువు

బాలికలు ఉన్న హాస్టల్‌కు వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రిళ్లు రక్షణ కరువైంది. పాఠశాల నుంచి దూరంలో ఉన్న మెస్‌కు వెళ్లడానికి భయపడుతున్నారు. బయట వ్యక్తులు వచ్చిపోతున్నారని విద్యార్థినులు అంటున్నారు.

అందని నాప్కిన్స్, కాస్మొటిక్ చార్జీలు

విద్యార్థులకు ప్రతి నెలా ఇవ్వాల్సిన నాప్కిన్స్, కాస్మొటిక్ చార్జీలను ఇవ్వడం లేదు. దీంతో పేద గిరిజన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకోని వార్డెన్, ప్రిన్సిపాల్

విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నా వార్డెన్, ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. వార్డెన్ పుట్టినరోజున తమతో చపాతీలు చేయించి పార్టీ చేసుకున్నాడని విద్యార్థులు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులకు పెట్టవలసిన కోడిగుడ్లను కొందరు ఉపాధ్యాయులు రాత్రిళ్లు రూమ్‌లకు తీసుకెళ్లి ఆమ్లెట్లు వేసుకుని ఆరగిస్తున్నారట! ప్రిన్సిపాల్ సైతం ప్రతిరోజూ రాత్రి చపాతీలు చేయించుకుంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అరకొర వసతులపై అధికారులకు ఫిర్యాదు

హాస్టల్‌లో అరకొర వసతులతో సతమతమవుతున్నామని విద్యార్థులు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, వైద్యాధికారి దివాకర్ వద్ద మొర పెట్టుకున్నారు. శుక్రవారం వారు హాస్టల్, పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. విద్యార్థుల సమస్యలను జిల్లా కలెక్టర్, పీఓ, పీడీలకు నివేదిస్తామని తెలిపారు.

పనిచేయని వంటతయారీ యంత్రాలు



అన్నం తయారు చేయడానికి వాడే స్టీమ్, వస్తువులు చెడిపోకుండా ఉంచే ఫ్రిడ్జ్, చపాతీ రొట్టెలను తయారు చేసే మెషిన్, పిండిమర ఆడించే గ్రైండర్లు మరమ్మతులకు గురై మూలన పడిఉన్నాయి.



కుళ్లిన దోసకాయలు, ఎర్రగడ్డలు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు





మరమ్మతులకు గురైన చపాతీ తయారు చేసే యంత్రం, ఫ్రిడ్జ్

వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయం



అన్నదానం చేస్తున్న బొప్పన తిలక్‌బాబు

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ బొప్పన వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి అన్నారు. వెంకటకృష్ణయ్య 4వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన తనయుడు రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వెంకటకృష్ణయ్య చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. వెంకటకృష్ణయ్య పార్టీకి చేసిన సేవలను స్మరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచ్ దుద్దు వేణు, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి, విజయ్ రెడ్డి, నాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



జవాన్‌ను సత్కరిస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి: కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగం మరువలేనిదని మున్సిపల్ కమిషన్ రమేష్‌బాబు కీర్తించారు. శుక్రవారం స్థానిక కార్గిల్ సెంటర్‌లో మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవాన్ వెంకటేశ్వరరావును సత్కరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

భూ సమస్యలను పరిష్కరించాలని ధర్నా

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ద్రోహం
- మండిపడ్డ వామపక్ష నేతలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. తెలుగుదేశం భాగస్వామ్యం ఉన్న ఎన్డీయే రాష్ట్రానికి మొండి చేయి చూపిందని, బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ దీనిపై ప్రశ్నించకుండా, నిధులు రాబట్టలేకుండా దాసోహమైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి జనార్దన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నలుగురు రమణయ్య, నాయకులు బాలగురవయ్య, తిరుపాలు, సుబ్బయ్య, జేకే రమణయ్య, రమణయ్య, కృష్ణమ్మ, మల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువపై ఆక్రమణల తొలగింపు



కాలువపై అక్రమ కట్టడం తొలగిస్తున్న పురపాలక సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని మురుగు కాలువలపై అక్రమ కట్టడాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. అక్రమ కట్టడాల వల్ల కాలువలో పూడిక తీసేందుకు ఇబ్బందిగా ఉందని, మరోవైపు జ్వరాలు ప్రబలుతున్నాయని, అందుకే కాలువలపై కట్టడాలను తొలగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మేస్త్రీలు శ్రీకాంత్, అనిల్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు..సమాజానికి వెలుగు



ర్యాలీని ప్రారంభిస్తున్న సీడీపీవో కృష్ణమంజరి

రేణిగుంట: బాలికలు చదువుకుని ఉన్నత స్థాయిలో రాణిస్తే సామాజిక వికాసం సాధ్యమవుతుందని రేణిగుంట ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణమంజరి తెలిపారు. మండలంలోని కరకంబాడి, ఎర్రమరెడ్డి పాళెం గ్రామాల్లో శుక్రవారం బెంగళూరు క్రై సంస్థ సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో 'పూరీ పడాయి దేశ్‌కి భళాయి' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఇందులో 55 మంది అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. సీడీపీవో కృష్ణమంజరి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని, ప్రతి అమ్మాయి ఉన్నత చదువులు చదవాలన్నారు. ప్రగతి పీసీవో నితీష మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకుని ఉద్యోగాలు చేస్తారో, ఆ సమాజం ఆర్థికంగా ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హైమావతి, అనంతలక్ష్మి, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించడానికే 'శిక్షా సప్తాహ్'



శ్రీకాళహస్తి : విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదంతో పాటు ఐక్యతను పెంపొందించడానికే శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్‌పీబీఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి అన్నారు. పాఠశాలలో శుక్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యావిధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ పేరిట విద్యాశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పిల్లల్లో సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ కలిగించడంతోపాటు కులాలు, మతాలను ఏకం చేస్తూ భిన్నత్వంలో ఏకత్వం భావనను నింపడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.

శాకాంబరి అలంకారంలో ముత్యాలమ్మ



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ముత్యాలమ్మ శాకాంబరి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా పంచహారతులు ఇచ్చి ధూప దీప నైవేద్యం సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో శుక్రవారం ఉత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

ఆడికృత్తికకు 15 ఆర్టీసీ సర్వీసులు

సత్యవేడు: ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం నుంచి 15 సర్వీసులు తిరుత్తణికి నడుస్తాయని సత్యవేడు డిపో మేనేజర్ కే.వెంకటరమణ తెలిపారు. సత్యవేడు నుంచి నాగలాపురం రామగిరి, పిచ్చాటూరు, శివాడ, ఎన్ఎన్ కండ్రిగ మార్గం మీదుగా ఇవి తిరుత్తణి చేరుతాయన్నారు. భక్తులు, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి పంట పరిశీలన



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పేడు: మండలంలోని కోబాక రెవెన్యూ పరిధిలో అడవి పందుల దాడిలో దెబ్బతిన్న వరి పంటను శుక్రవారం అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీ లించారు. వరి పంటపై అడవి పందుల దాడి అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతుల ఆధ్వర్యంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. 33 శాతం కంటే తక్కువగా పంట దెబ్బతినిందని, ప్రభుత్వం నుంచి రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి వీలుపడదని ఏవో షణ్ముగం తెలిపారు. అడవి పందుల నివారణ కోసం చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు శోభారాణి, పొన్నారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ వాణి రైతులకు హామీ ఇచ్చారు.

సాక్షి ఎఫెక్ట్..

పారిశుధ్యం మెరుగు

రేణిగుంట : స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పంచాయతీ సిబ్బంది శుక్రవారం పారిశుధ్యం మెరుగు పరిచారు. 'నిర్వహణ లోపం- ప్రయాణికులకు శాపం' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలగించారు. ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

గురువుల సేవలకు విలువ కట్టలేం



- హెచ్‌ఎం, టీచర్లకు సన్మానంలో డీవైఈఓ

నారాయణవనం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషికి, వారి సేవలకు విలువ కట్టలేమని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాలమంగళం ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపును తీసుకువచ్చిన హెచ్‌ఎం మనోహరిని, ఉపాధ్యాయులను శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా డీవైఈఓ మాట్లాడారు. ఏటా పాలమంగళం హైస్కూలు విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచడమే కాకుండా ట్రిపుల్ ఐటీకి సైతం ఎంపిక అవుతున్నారని ప్రశంసించారు. ఇదంతా టీచర్ల విద్యాబోధన, విద్యార్థులపై కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ కారణమన్నారు. హెచ్‌ఎం మనోహరి మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయులతోనే గుర్తింపు సాధ్యమైందని, ఈ గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమైన ఇంటర్ కోర్సుల్లోనూ మంచి ఫలితాలు సాధిస్తామన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



పోలి విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అధికారులు

శ్రీకాళహస్తి రూరల్ : జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ గణాంకాధికారి నాగేంద్రకుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఎంవో బేబీరాణి, డీపీవో ప్రకాష్ తెలిపారు. వారు శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలోని పోలి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. రక్త హీనతతో బాధపడే వారిని గుర్తించి పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్ కుమార్, రాహుల్ రాజ్, హెల్త్ సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి



మిద్దెల హరిని సన్మానిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని బెంగళూరుకు చెందిన ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజర్ నవీన్ కవల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతపై మక్కువ పెంచుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తున్నామన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.గీతాదేవి, డైరెక్టర్ ఎ.కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులపై అఘాయిత్యాలను అరికట్టాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో చిన్నారులపై వరుసగా జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం విద్యార్థులతో కలిసి శ్రీకాళహస్తిలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కోగిలి ముని చందు మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాల రవాణా పెచ్చుమీరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో మారణ హోమం జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. స్త్రీలకు భద్రత కల్పించాలని, హామీలు నెరవేర్చాలన్నారు. చిన్నారుల నుంచి పండు వృద్ధులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు భావితరాల భవిష్యత్తు తన బాధ్యత అని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు అత్యాచారాలపై స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవ హారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అఖి, సతీష్, షాహిద్, జయప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.